క్లుప్తంగా

రేపు బండ్లమ్మ ఆలయ హుండీ లెక్కింపు

పిట్టలవానిపాలెం: చందోలు గ్రామంలో వేంచేసి ఉన్న బగళాముఖి అమ్మవారి దేవాలయంలో భక్తులు సమర్పించిన కానుకల హుండీని బుధవారం లెక్కించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు దేవాదాయ శాఖ ఉప కమిషనర్ ఆదేశాల మేరకు, బాపట్ల దేవదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో లెక్కింపు జరుగుతుందని పేర్కొన్నారు.

'స్పందన'కు 7 అర్జీలు



రేపల్లె రూరల్: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్పందన కార్యక్రమం చక్కని వేదిక అని ఆర్డీవో జగన్నాథం పార్థసారథి అన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. సర్వే చేయించాలని కోరుతూ 2, డ్రైనేజీ సమస్యపై 2, మొక్కజొన్న నష్టపరిహారం ఇప్పించాల్సిందిగా 1, పొలాలకు దారి కల్పించాలని కోరుతూ 1, పంట కాల్వ పూడిక తీయించాల్సిందిగా 1 చొప్పున మొత్తం 7 అర్జీలు అందాయని ఆర్డీఓ తెలిపారు. వీటిని పరిశీలించి, సమస్యలను పరిష్కరించటం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కౌలు కార్డుల పంపిణీ



పిట్టలవానిపాలెం: పంట సాగు హక్కు పత్రాలపై అవగాహన కలిగి ఉండాలని మండల వ్యవసాయ విస్తరణాధికారి సుదర్శనరావు పేర్కొన్నారు. అల్లూరు గ్రామంలోని ఆర్బీకేలో వ్యవసాయ, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో కౌలు రైతులకు పంట సాగు హక్కు పత్రాలపై సోమవారం అవగాహన కల్పించారు. అనంతరం కౌలు కార్డులను రైతులకు అందజేశారు. కౌలు కార్డులతో పొలం యజమానికి ఎలాంటి ఇబ్బంది ఉండదని, 11 నెలల పాటు ఈ సాగు హక్కుపత్రాల కాల పరిమితి ఉంటుందని తెలిపారు. గ్రామ సర్పంచ్ ఉప్పు చెంచులక్ష్మి, మాజీ సర్పంచ్ బడుగు ప్రకాశరావు, అలకాపురం సర్పంచ్ ఎం.గంగరాజు, పంచాయతీ కార్యదర్శి శివకుమార్, వీఆర్వో అలవర్తి వెంకటసుబ్బారావు, వీఏపీ దీప్తి పాల్గొన్నారు.

నేడు రచ్చ బండ కార్యక్రమం

నడిగడ్డవారిపాలెం(వేమూరు): చుండూరు మండలంలోని నడిగడ్డ వారిపాలెంలో మంగళవారం ఉదయం 7.30గంటలకు రచ్చబండ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని చుండూరు గ్రామ సర్పంచ్ వుయ్యూరి అప్పిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.

విద్యార్థులకు న్యాయ విజ్ఞాన సదస్సు

ఇంటూరు(వేమూరు): బాలల హక్కుల చట్టాలు గురించి ప్రతి విద్యార్థి తెలుసుకోవాలని తెనాలి సివిల్ కోర్టు జడ్జీ మాలతి పేర్కొన్నారు. అమర్తలూరు మండలంలోని ఇంటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. పాఠశాలలో 9, 10 తరగతి విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ ఖాదర్ హుస్సేన్, బి.రవీంద్ర, కనపర్తి ఇజ్రాయేలు విద్యార్థులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తెనాలిరూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు పట్టణ సుల్తానాబాద్‌కు చెందిన సూర్య ప్రకాశరావు (67) బంగారు ఆభరణాల దుకాణంలో గుమాస్తాగా పనిచేస్తున్నాడు. ఈ నెల 23వ తేదీ రాత్రి దుకాణం నుంచి వెళ్తుండగా గంగానమ్మపేట పాత శివాలయం వద్ద బైకు ఢీకొనడంతో గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు గుంటూరు వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. వైద్యశాల నుంచి వచ్చిన సమాచారం మేరకు టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

తెనాలిరూరల్: రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తెనాలి రైల్వేస్టేషన్ యడ్ల లింగయ్య కాలనీ మధ్యలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు మృతుడి వయస్సు సుమారు 40 నుంచి 45 ఏళ్ల మధ్య ఉంటుంది. నల్ల చొక్కా, నల్ల లుంగీ ధరించి ఉన్నాడు. సమాచారం అందుకున్న తెనాలి జీఆర్పీ పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మత్తుకు చిక్కితే.. భవిష్యత్తు చిత్తు!

- రేపల్లె డీఎస్పీ మురళీకృష్ణ
- అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం
- దుష్పరిణామాలపై విద్యార్థులకు అవగాహన
- పాఠశాల, కళాశాల విద్యార్థులతో ర్యాలీలు, మానవ హారాలు
- భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని సూచన



రేపల్లెలో ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎస్పీ మురళీకృష్ణ

రేపల్లె: మత్తు పదార్థాలు తీసుకోవటంతో ఆర్థికంగా, మానసికంగా, శారీరకంగా అనేక దుష్పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని రేపల్లె డీఎస్పీ మురళీకృష్ణ పేర్కొన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినం సందర్భంగా మత్తు పదార్థాలు తీసుకోవడం వల్ల కలిగే దుష్పరిణామాలపై సోమవారం పోలీస్ శాఖ విద్యార్థులకు అవగాహన కల్పించింది. పాఠశాల, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, సిబ్బంది వారిని చైతన్య పరిచారు. అనంతరం ర్యాలీలు నిర్వహించి, పత్తు పదార్థాలు తీసుకోమని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. రేపల్లె పట్టణంలోని వివిధ పాఠశాలల విద్యార్థులతో నిర్వహించిన మత్తు పదార్థాల వ్యతిరేక అవగాహన ర్యాలీని డీఎస్పీ ప్రారంభించి, మాట్లాడారు. విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ మాదక ద్రవ్యాల జోలికి పోవద్దని హెచ్చరించారు. డ్రగ్స్, ఖైనీ, గుట్కా, నాటు సారా, తంబాకు వంటివి తీసుకోవడం వల్ల తీసుకోవటంతో అనేక వ్యాధుల బారిన పడే ప్రమాదముందన్నారు. గొంతు, నోరు, మెడ, అన్నవాహిక, ఇతర ఏరోడైజెస్టివ్ ట్రాక్ట్(గొంతు నుంచి జీర్ణకోశం వరకు) క్యాన్సర్ మహమ్మారి బారినపడే అవకాశాలు నూరుశాతం ఉన్నాయన్నారు. భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాలంటే చదువు, ఆటలపై మాత్రమే ఏకగ్రాత నిలపాలన్నారు. కార్యక్రమంలో సీఐలు నజీర్‌బేగ్, ఎ.శివశంకర్, ఎస్‌ఐ అబ్దుల్ రజాక్ పాల్గొన్నారు. మండలంలోని చోడాయపాలెం పోలీసు స్టేషన్‌లో ఎస్‌ఐ శివప్రసాద్ బొబ్బర్లంక జెడ్పీ హైస్కూలు విద్యార్థులతో పుర ర్యాలీ నిర్వహించారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

చెరుకుపల్లి: స్థానిక ఎస్‌ఐ డి.వెంకట కొండారెడ్డి, ఎస్ఈబీ అధికారుల సయుక్త అధ్వర్యంలో మత్తు పదార్థాల వాడకం వల్ల కలిగే అనర్థాలపై ఈఎస్ఆర్ నర్సింగ్ విద్యార్థినులతో హాస్పిటల్ నుంచి అంబేద్కర్ సెంటరు వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు, స్థానికులతో మానవహారం ఏర్పాటు చేసి, మాదక ద్రవ్యాల వినిమోగానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ఎస్ఈబీ నగరం అధికారులు శ్రీనివాసరావు, ఏఎస్‌ఐలు బ్రహ్మం, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జీవితాన్ని నాశనం చేసుకోవద్దు

నిజాంపట్నం: అడవులదీవి ఎస్‌ఐ వెంకట రవి ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీ హైస్కూల్ నుంచి మెయిన్ సెంటర్ వరకు స్థానికులు, విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. మెయిన్ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి విద్యార్థులతో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ప్రతిజ్ఞ చేసిన ఇద్దరు చిన్నారులకు ఎస్‌ఐ ఒక్కొక్కరికి రూ.500ల చొప్పున నగదు ప్రోత్సాహకం అందించారు. నిజాంపట్నం ఎస్‌ఐ రమేష్ పట్టణంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు.



ఈఎస్ఆర్ నర్సింగ్ విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్సై కొండారెడ్డి

మత్తు పదార్థాల వినియోగం.. భవిష్యత్తుకు శాపం

కొల్లూరు : స్థానిక ఏఎస్‌ఐ బాబురావు విద్యార్థులతో కొల్లూరు ప్రజలకు మాదక ద్రవ్యాల వినియోగ దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక పోలీసు స్టేషన్ వద్ద నున్న బీఆర్‌కే శాస్త్రీ ఐటీఐ కళాశాల విద్యార్థులతో కలసి బస్టాండ్ సెంటర్ వరకు ప్రదర్శన నిర్వహించారు. మానవహారంగా ఏర్పడి మత్తు పదార్థాల వినియోగానికి వ్యతిరేకంగా నినాదాలు చేపట్టారు.

మత్తు పదార్థాలకు బానిసలైతే.. జీవితాలు నాశనం

నగరం: రేపల్లె రూరల్ సీఐ శివశంకర్ స్థానిక ఎస్వీఆర్ఎం కళాశాలలో మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. కళాశాల నుంచి నగరం మెయిన్ సెంటర్ వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ అనగాని హరికృష్ణ, ఎస్‌ఐ రామకృష్ణ పాల్గొన్నారు.

చుండూరు, అమర్తలూరులో..

చుండూరు: చుండూరు రూరల్ సీఐ అంబటి రాజమోహన్ చుండూరు, అమర్తలూరు పోలీసు స్టేషన్ల పరిధిలో మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. చుండూరు మండల కేంద్రంలో విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అమర్తలూరులో విద్యార్థులతో మానవ హారంగా ప్రతిజ్ఞ చేయించారు. ఎస్‌ఐలు నవీన్, పి.సురేష్ పాల్గొన్నారు.



అడవుల దీవిలో మానవహారంగా ఏర్పడిన విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ వెంకట రవి

జీవితాన్ని నాశనం చేసుకోవద్దు

వేమూరు: వేమూరు రూరల్ సీఐ వెంకటేశ్వరరావు స్థానిక బస్టాండ్ సెంటర్‌లో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. పోలీసు సిబ్బంది, సచివాలయ మహిళా పోలీసులు పాల్గొన్నారు. సీఐ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి, విద్యార్థులు తమ జీవితాలను చక్కదిద్దుకోవాలని సూచించారు. ఎస్‌ఐ నాగరాజు, రైటర్ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ర్యాలీ

భట్టిప్రోలు: భట్టిప్రోలు ఎస్‌ఐ అంబటి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సోమవారం టీఎంరావు హైస్కూల్ వద్ద నుంచి బస్టాండ్ సెంటర్ వరకు విద్యార్థులు, మహిళా పోలీసులు, ఉపాధ్యాయులు మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. మాదక ద్రవ్యాల దుష్పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు చందలూరి రామ కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు, పోలీసులు పాల్గొన్నారు.

డ్రగ్స్ నిర్మూలన ప్రతిఒక్కరి బాధ్యత

బాపట్ల: డ్రగ్స్ నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని సుశీల స్కూల్ ఆఫ్ నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ పేర్లి సునీల్ పేర్కొన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నిర్మూలన దినోత్సవం సందర్భంగా కళాశాలలో అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సిరి ప్రాజెక్ట్ మేనేజర్ వెంకట్రావు, శ్రీనివాస్, లక్ష్మీ, సుజాత, సురేఖ, స్వరూప, వికాస్ సంస్థ డైరెక్టర్ నజీర్ పాల్గొన్నారు.



కొల్లూరు బస్టాండ్ సెంటర్‌లో విద్యార్థులతో ప్రదర్శన నిర్వహిస్తున్న పోలీసులు



సదస్సులో మాట్లాడుతున్న రేపల్లె రూరల్ సీఐ శివశంకర్



అమర్తలూరు మండల కేంద్రంలో మానవ హారంగా విద్యార్థుల ప్రతిజ్ఞ



వేమూరులో మాదక ద్రవ్యాలకు వ్యతిరేక ర్యాలీ



భట్టిప్రోలులో జరిగిన ర్యాలీలో పాల్గొన్న ఎస్‌ఐ చంద్రశేఖర్, ఉపాధ్యాయులు



డ్రగ్స్ నిర్మూలన దినోత్సవంలో పాల్గొన్న నర్సింగ్ విద్యార్థినులు

గ్రంథాలయానికి కుర్చీలు వితరణ



కొల్లూరు : గ్రంథాలయంలో పుస్తక పఠనానికి అవసరమైన కుర్చీలను దాతలు వితరణగా అందజేసినట్లు గ్రంథాలయాధికారి వై. రాంబాబు తెలిపారు. కొల్లూరుకు చెందిన మాకినేని బసవపున్నయ్య కుమారులు బసవశంకర్, రవిశంకర్‌లు రూ. 5 వేలు విలువ చేసే 10 కుర్చీలను అందజేసినట్లు చెప్పారు. దాతలు ఇరువురికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

వేటకెళ్లిన మత్స్యకారుడి మృతి

రేపల్లె: కృష్ణానదిలో చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు మత్స్యకారుడు మృతి చెందిన ఘటన గంగడిపాలెం పంచాయతీలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన సైకం వెంకటేశ్వరరావు(52) ఆదివారం రాత్రి గంగడిపాలెం సమీపంలోని కృష్ణానదిలో చేపల వేటకు వెళ్లాడు. సోమవారం ఉదయం వరకు ఇంటికి తిరిగిరాకపోవటంతో నది ఒడ్డున గాలించగా అతని మృతదేహం కనిపించింది. మృతునికి భార్య వెంకటేశ్వరమ్మ, కుమారుడు శ్రీనివాసరావు ఉన్నారు.

వర్క్ షాప్‌ను జయప్రదం చేయండి

పెదకాకాని: పెదకాకాని సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం శంకర కంటి హాస్పిటల్ వద్ద ఆటో కార్మికుల సమావేశం కేసాని గోపీ అధ్యక్షతన జరిగింది. ఏఐఆర్‌టీ డబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నన్నపనేని శివాజీ మాట్లాడుతూ మంగళవారం ఉదయం 10 గంటలకు పాత గుంటూరు సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఆటో ప్రైవేట్ ట్రాన్స్‌పోర్టు జిల్లా వర్క్ షాపు బి.లక్ష్మణరావు అధ్యక్షతన జరుగుతుందని తెలిపారు. ఈ వర్క్ షాప్‌లో ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజఫర్ అహ్మద్ పాల్గొంటారని తెలిపారు. మోటార్ వాహనాల డ్రైవర్ల సమస్యలపై చర్చిస్తారని జిల్లాలో ఆటో, లారీ ట్రాన్స్‌పోర్టు వివిధ వాహనాల యూనియన్ల బాధ్యులు అందరు పాల్గొనాలని కోరారు. ఇప్పటికే బాడుగు లేక ప్రతి నెలా కిస్తీలు చెల్లించలేక ఫైనాన్సర్లతో డ్రైవర్లు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. సీఐటీ యూ నగర కార్యదర్శి కె.శ్రీనివాస్, ఆటో నాయకులు కె.కొండలు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

మండల సర్వతోముఖాభివృద్ధికి పాటుపడదాం

- ఎంపీపీ లలిత కుమారి
- భట్టిప్రోలు మండల సర్వసభ్య సమావేశం

భట్టిప్రోలు: ప్రజా ప్రతినిధులు, అధికారుల సమష్టి కృషితో మండల సర్వతోముఖాభివృద్ధికి పాటుపడదామని ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి కోరారు. సోమవారం మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలని అధికారులను కోరారు. హైస్కూల్స్‌కు ప్రభుత్వం పంపిన వాటర్ ప్లాంట్లు నిరుపయోగంగా మారాయని, మండల కో–ఆప్షన్ సభ్యులు షేక్ సలీమ్ విద్యాశాఖాధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ప్రతి నెలా విద్యుత్ బిల్లులు నిర్ణీత తేదీల్లో పడకపోవడంతో.. స్లాబ్ రేటు పెరిగిపోతోందని ఎంపీటీసీ సభ్యురాలు కొతరపు పద్మావతి అధికారులకు వివరించారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాల్లో పాలు సరిగా అందడం లేదని ఎంపీటీసీ సభ్యులు నన్నెపాముల చంటి, దున్నా తిరుపతి బాబు ఐసీడీఎస్ సిబ్బందిని ప్రశ్నించారు. ఆయా శాఖల అధికారులు..శాఖాపరంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరించారు. మొత్తానికి సమావేశం సాదాసీదాగా జరిగింది. సమావేశంలో ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయ భాస్కరి, తహసీల్దార్ డి.వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ మల్లోలు ఉషారాణి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ లలిత కుమారి, జెడ్పీటీసీ, మండల స్థాయి అధికారులు

'జగనన్న సురక్ష' సర్వే పరిశీలన



పిట్టలవానిపాలెంలో పాల్గొన్న తహసీల్దారు కవిత, ఎంపీడీఓ శేషమాంబ



దుండివారిపాలెంలో జగనన్న సురక్ష సర్వేలో తహసీల్దార్ కేశవనారాయణరావు

పిట్టలవానిపాలెం: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ భవనం మారుతీ శేషమాంబ అన్నారు. భవనంవారిపాలెం, పిట్టలవానిపాలెం గ్రామాల్లో నిర్వహిస్తున్న జగనన్న సురక్ష సర్వేను తహసీల్దారు కవితతో కలిసి ఆమె సోమవారం పరిశీలించారు. ప్రజలకు 11 రకాల పత్రాలు, సర్టిఫికెట్లు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కె.పద్మజ, గ్రామ కార్యదర్శులు వసుంధరలక్ష్మి, శ్రీనివాసరావు, వీఆర్వోలు సర్వోత్తమరావు, నాగజ్యోతి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఉన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలి

కర్లపాలెం: అర్హులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేందుకే ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభించిందని తహసీల్దార్ జి.కేశవనారాయణరావు తెలిపారు. సోమవారం దుండివారిపాలెంలో జరుగుతున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని తహసీల్దార్ కేశవనారాయణరావు పర్యవేక్షించారు. నేరుగా ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈవోపీఆర్డీ ఎ.ఎలీషాబాబు, వీఆర్వో యశ్వంతి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, వెల్ఫేర్ అసిస్టెంట్ నాగూర్ షరీఫ్, వీవీఏ మణ్యం సునీత, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యభిచార గృహంపై దాడి

గుంటూరు రూరల్: గుట్టుచప్పుడు కాకుండా నగర శివారులో ఓ నివాసంలో వ్యభిచారం నిర్వహిస్తున్న నిర్వాహకురాలిని నల్లపాడు పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. సీఐ శ్రీనివాసరావు వివరాల మేరకు.. గోరంట్ల శివారులో ఓ నివాసంలో వ్యభిచార గృహంపై దాడి చేసి నిర్వాహకురాలు బండ్ల తులసి, భర్త బాలానందకుమార్, వీరితోపాటు ఒక మహిళ, నలుగురు విటులను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదుచేసి, విచారణ చేస్తున్నామని సీఐ తెలిపారు.

పేకాట స్థావరాలపై దాడులు

గుంటూరు రూరల్: గోరంట్ల, నల్లపాడు శివారుల్లో పేకాట స్థావరాలపై నల్లపాడు పోలీసులు సోమవారం దాడులు నిర్వహించారు. 13 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ. 7,600లు నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

భట్టిప్రోలు వైద్యుడు నాని మృతి



భట్టిప్రోలు: భట్టిప్రోలులో మూడు దశాబ్దాలుగా వైద్య సేవలు అందిస్తూ అందరికి సుపరిచితులైన రిజిష్టర్ మెడికల్ ప్రాక్టీషనర్, వైద్యులు తిరువీధుల శ్రీహరి అలియాస్ నాని (65) సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈయనకు భార్య, కుమారుడు ఉన్నారు. 1995 నుంచి 2000 వరకు భట్టిప్రోలు గ్రామ పంచాయతీ వార్డు సభ్యులుగా పని చేశారు. ఆయన మృతి పట్ల భట్టిప్రోలు కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ నాయకులు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యుల సమాచారంతో తాడిగడప (విజయవాడ) నుంచి ఎల్వీ ప్రసాద్ వైద్యులు సాయికుమార్ బృందం విచ్చేసి నాని నేత్రాలను సేకరించారు.

ఈ లక్షణాలుంటే కుష్ఠు ఉన్నట్లే..జాగ్రత్త పడండి

నిజాంపట్నం: ఒంటిపై అనుమానిత మచ్చలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని హెల్త్ సూపర్ వైజర్ మురళీ కోరారు. కుష్ఠు వ్యాధి నిర్మూలనలో భాగంగా గుర్నాథ నగర్‌లో సోమవారం ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్ వైజర్ మురళీ మాట్లాడుతూ శరీరంపై పాలిపోయిన, రాగి, ఎరుపు రంగు మచ్చలు, చర్మంపై స్పర్శలేని, నొప్పి లేదా దురదలేని మచ్చలు, వాచిన, నొప్పిగా ఉన్న నరాలు వంటి లక్షణాలు కనిపిస్తే..వెంటనే వైద్య సిబ్బంది దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా సంక్షేమ పథకాల అమలు

- ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు
- నిజాంపట్నంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



వృద్ధురాలికి సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎంపీ మోపిదేవి

నిజాంపట్నం: కుల, మత, పార్టీలకు అతీతంగా పారదర్శకంగా సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు తెలిపారు. నిజాంపట్నంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు మాట్లాడుతూ ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. గత ప్రభుత్వాలకు భిన్నంగా, అన్ని వర్గాల ప్రజలను అభివృద్ధి చేయాలనే మహా సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి, ప్రతి హామీని అమలు చేసి ప్రజల హృదయాల్లో ఆయన స్థానం సంపాదించుకున్నారని చెప్పారు. రానున్న రోజుల్లో సీఎం వైఎస్ జగన్‌కు అండగా నిలిచి, మరోసారి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఇంటింటికి వెళ్లి ఒక్కో కుటుంబానికి ప్రభుత్వం నుంచి చేకూరిన సంక్షేమ లబ్ధిని వివరించారు. ఎంపీపీ మోపిదేవి విజయనిర్మల, వైఎస్సార్ సీపీ నాయకులు మోపిదేవి హరనాథ బాబు, జెడ్పీటీసీ నర్రా సుబ్బయ్య, మాజీ జెడ్పీటీసీ ప్రసాదం వాసుదేవ, ఎంపీటీసీ నాజర్‌ఖాన్, పలు శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

రేపల్లె: ఓల్డ్ టౌన్‌లోని అర్బన్ హెల్త్ సెంటరులో విధులు నిర్వర్తిస్తున్న తమ సమస్యలు పరిష్కరించాలని ఆశ వర్కర్లు సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం పట్టణ ఫ్యామిలీ వెల్ఫేర్ మెడికల్ ఆఫీసర్ రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆశ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) గౌరవాధ్యక్షుడు మణిలాల్ మాట్లాడుతూ నూతనంగా వచ్చిన మెడికల్ ఆఫీసర్ ఒత్తిడితో తలెత్తుతున్న సమస్యలు పరిష్కారించాలని కోరారు. ఆశ వర్కర్స్‌కి రోజుకు ఐదుగురు రోగులను వెంట పెట్టుకొని తీసుకురావాలని ఆదేశాలివ్వటం తగదన్నారు. ఇతర కారణాలు చూపి దురుసుగా ప్రవర్తించటం, మెమోలిచ్చి వివరణలు పదేపదే అడగటం సరికాదని చెప్పారు. అధికారులు స్పందించి అర్బన్ హెల్త్ సెంటరులో ఆశ వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఆశ వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు టి.బుజ్జి, పావని, ఎస్తేర్ రాణి, మహాలక్ష్మి, జ్యోతి, కీర్తి, గులాబీ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు వేతనాలు చెల్లించాలి

వేమూరు: ఉపాధి కార్మికుల వేతనాలు వెంటనే విడదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బి.అగస్టీన్ కోరారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాసరావుకు ఈ మేరకు వినతిపత్రం సోమవారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలకు 14 రోజుల లోపు వేతనాలు ఇవ్వాల్సి ఉండగా ఇంత వరకు ఇవ్వలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో జల్లి రత్నకుమారి, టి.మరియమ్మ, గేరా సౌజన్య, కె.దివ్య, అరుణ, చోడవరపు జాన్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ ప్రవేశానికి రిజిస్ట్రేషన్ గడువు పొడిగింపు

రేపల్లె: డిగ్రీలో ప్రవేశానికి గడువు పొడిగించినట్లు ప్రభుత్వ ఏబీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టీసీ రవిచంద్రకుమార్ తెలిపారు. స్థానిక కళాశాలలో సోమవారం ఆయన మాట్లాడారు. డిగ్రీ ప్రవేశానికి జులై 5 వరకు విద్యార్థులు రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేయించుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. జులై 7 నుంచి 12వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు నిర్వహించనున్నట్లు చెప్పారు. జులై 17 నుంచి మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభమవుతాయన్నారు. కళాశాలలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ ద్వారా రిజిస్ట్రేషన్, వెబ్ ఆప్షన్‌లను నమోదు చేసుకునే అవకాశం కల్పించామన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏబీఆర్ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ–కంప్యూటర్ సైన్స్, బీఎస్సీ–మాథ్స్, బీఎస్సీ–కెమిస్ట్రీ, బీఎస్సీ–జువాలజీ, బీకాం కంప్యూటర్స్ బీఏ–హిస్టరీ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. కళాశాలలో ఆధునిక హంగులతో నూతనంగా సెమినార్ హాలు, డిజిటల్ లైబ్రరీ, ఉచిత వై–ఫై సౌకర్యం, జిమ్, ఇండోర్ గేమ్స్, సువిశాల క్రీడా ప్రాంగణంతో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. పూర్తి వివరాలకు కళాశాలలో సంప్రదించవచ్చని చెప్పారు.